శనివారం 24, మార్చి 2001

వార్త

# ముచ్చటగొలిపిన నీలిమ నృత్యం

విశాఖపట్నం, మార్చి23 (ప్రభాతవార్త-కల్చరల్): ముగ్ధమనోహరం ఆమె అభినయ శిల్పం...నయనానందకరం ఆమె పదవిన్యాసం.... ఉత్తేజ తరంగం ఆమె భంగిమల లాలిత్యం. ఆ నృత్య శిల్పం నీలిమా రాజు. శ్రీహరిరామమూర్తి శిష్యురాలైన ఈమె కూచిపూడి నృత్య ప్రదర్శన శుక్రవారం ఆంధ్రవిశ్వకళాపరిషత్ కె.వి.గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలంలో జరిగింది. ఎ.యు. కల్చరల్ ఫోరమ్ ప్రతినెలా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హంసధ్వని రాగంలో 'తాండవ నృత్యకరే గజానన' కౌత్వుం ప్రదర్శనతో ప్రారంభమైన ఈ కూచిపూడి నృత్యప్రదర్శనలో రాగమాలికలో ముత్తుస్వామి దీక్షితార్ కృతి, కామాక్షి స్తుతి 'కంజదళాయతాక్షి', రాగమాలికలోనే వెంకటసుబ్బయ్యార్ కృతి 'మరకత మణిమయచేల', మోహనరాగంలో శావాష్టకం, పుత్రిక రాగంలో ధిల్లాన అంశాలు నీలిమ సత్సాంప్రదాయ పద్ధతిలో ప్రదర్శించి నృత్య పండితుల ప్రశంసలందుకుంది. అంశాల ప్రదర్శనలో ముద్రల్లో స్వచ్ఛత, పద విన్యాసం ఆకర్షణీయంగా వున్నాయి. సాహిత్యానుగుణ్యమైన అభినయంతో ప్రేక్షకుల్ని రసానందంలో ముంచిన ఈమె ఎ.యు. బయో టెక్నాలజీ విద్యార్థి. నీలిమా రాజు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.వో), ప్రపంచ తెలుగు మహాసభల వంటి అనేక వేదికలపై ప్రదర్శనలివ్వడం విశాఖకు గర్వకారణం. దీనికి శ్రీహరిరామమూర్తి నట్టువాంగంలో జి.వరహాలు గాత్రానికి జి.వెంకటరావు మృదంగంతో, ఎం.నీలాద్రి వాయులీనంతో, టి.అచ్యుతరావు వేణువుతో సహకరించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా జె.శారద వ్యవహరించారు.



ఇదే వేదికపై బయోటెక్నాలజీ విభాగం వార్షికోత్సవాన్ని ఆ విభాగ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో జరుపుకున్నారు. కార్యక్రమాలను రిజిస్ట్రార్ జె.ఎం. నాయుడు, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇక్బాల్, ప్రొఫెసర్ దీక్షితులు (డెహ్రాడూన్) ఇందులో పాల్గొన్నారు.